క్లుప్తంగా

వాహనాల వేలంలో రూ.75 వేలు

బంగారుపాళెం: వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ 75,520 ఆదాయం వచ్చినట్లు శనివారం ఎస్‌ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. మండలంలో మద్యం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన 8 ద్విచక్ర వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు సెబ్ అధికారులు, సీఐ నరసింహారెడ్డి పాల్గొన్నట్లు తెలిపారు.

పాలకల-2లో ఫ్యామిలీ డాక్టర్



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: మండలంలోని పాలకల-2లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత శనివారం 104 వైద్య శిబిరంలో 105 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్స చేసుకున్న రోగుల ఇంటి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్‌కు విశేష స్పందన లభించింది. మండలంలోని పాపసముద్రం గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి కతారి కుమార్ 121మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. పరిసరాలన్నింటినీ శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. జ్వరం, జలుబు, దగ్గు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు హేమలత, విద్య, ఏఎన్‌ఎం రుక్మిణి, సిబ్బంది కవిత, ప్రభావతి, బుజ్జమ్మ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పూతలపట్టు: మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాన్ని శనివారం ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయ భాస్కర్, ఎస్‌ఐ హరిప్రసాద్ పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లపై సిబ్బంది ద్వారా ఆరా తీశారు. తాగునీటి వసతితో పాటు కేంద్రం వద్ద ఓటర్లకు ఇబ్బంది లేకుండా చూడాలని వారికి సూచించారు.

పచ్చని పొదరిల్లు!



ఆ ఇంటి చుట్టూ వందలాది మొక్కలు... ఏపుగా పెరిగిన వృక్షాలు...పెరటి నిండా పచ్చదనం నిండిపోయి చూపరులను కనువిందు చేస్తోంది. ఈ ఇల్లు చిత్తూరు నగరం చెన్నమ్మగుడిపల్లి నుంచి మహాదేవనాయుడు కాలనీకి వెళ్లే మార్గంలో ఉంది. 10 ఏళ్ల కిందట ఇక్కడ ఇల్లు నిర్మించుకున్నారు. ప్రత్యేక ఆకర్షణ కోసం ముందు భాగంలో పూరిల్లు కట్టుకున్నారు. అయితే ఆ ఇంటి యజమానురాలు అనురాధకు చిన్నప్పటి నుంచి మొక్కలంటే ఇష్టం. కొన్నేళ్లుగా ఆమెకు నచ్చిన మొక్కలను ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి ఇంటి ఆవరణలో నాటుతూ వచ్చారు. ఇంటిని ఆహ్లాదకరమైన వాతావరణంగా మార్చుకున్నారు. ఇవన్నీ కూడా కేరళ, హైదరాబాద్, తమిళనాడు నుంచి తెప్పించారు. ఇక్కడ మొత్తం 700 రకాల మొక్కలు ఉన్నాయి. ఈ మొక్కలంతా ఆ ఇంటి ఆవరణాన్ని పచ్చని తోరణంలా నింపాయి. దీనికి తోడు చెట్లకు, ఇంటి గుమ్మం ముందు మట్టితో తయారు చేసిన కుండలు, పాత్రలతో మొక్కలను వేలాడదీశారు. మొక్కల నడుమ అక్కడక్కడ దేవుళ్ల బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి.

–చిత్తూరు రూరల్

తప్పిపోయిన బాలుడి అప్పగింత

చిత్తూరు అర్బన్: నగరంలో శనివారం తప్పిపోయిన మూడేళ్ల బాలుడిని గంటలోనే పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ నరసింహరాజు కథనం మేరకు.. రాజస్థాన్ కు చెందిన మసూద్ అలీ వృత్తిరీత్యా మగ్గం పని చేస్తూ స్థానిక జైహింద్ పాఠశాల సమీపంలో నివసిస్తున్నాడు. అతడి మూడేళ్ల కుమారుడు ఛాన్ బాబు ఆడుకుంటూ చర్చి వీధి వరకు నడుచుకుంటూ వెళ్లిపోయాడు. స్థానికులు గుర్తించి వెంటనే వన్ టౌన్ పోలీస్‌స్టేషన్లో అప్పగించారు. పిల్లాడి తల్లిదండ్రుల ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తుండగా, మసూద్ అలీ దంపతులు ప్రభుత్వాసుపత్రి వద్ద వెతుకుతూ కనిపించారు. ఎస్‌ఐ ప్రసాద్ వెంటనే వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి బాలుడిని అప్పగించారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

వ్యాధి నిరోధక టీకాలు వేయాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఆరోగ్య విద్యా అధికారి గుణశేఖర్

యాదమరి: వైద్య సిబ్బంది క్రమం తప్పకుండ వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి గుణశేఖర్ కోరారు. మండలంలోని శనివారం మాదిరెడ్డి పల్లె, యాదమరి ప్రభుత్వాసుపత్రి తరపున గ్రామాల్లో వైద్య సిబ్బంది చంటి పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. గర్భవతులకు, బాలింతలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుని సన్నిధిలో కర్ణాటక లోకాయుక్త



జస్టిస్ బిఎస్ పాటిల్ కుటుంబ సభ్యులకు చిత్రపటం అందిస్తున్న ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని కర్ణాటక లోకాయుక్త న్యాయమూర్తి జస్టిస్ బిఎస్.పాటిల్ శనివారం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం ఆయన కుటుంబ సమేతంగా మధ్యాహ్నం కాణిపాకం విచ్చేశారు. వారికి ఆలయ ఏఈఓ విద్యాసాగర్ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీనివాసుల రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవితవ్యం తల్లిదండ్రుల చేతుల్లోనే



మాట్లాడుతున్న హెచ్‌ఎం సబర్మతి

గుడిపాల: పదవ తరగతి విద్యార్థుల భవితవ్యం తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని నరహరిపేట జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయురాలు సబర్మతి అన్నారు. పాఠశాలలో శనివారం పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో శాయశక్తులా విద్యార్థులకు బోధన చేస్తున్నామని సాయంత్రం వేళల్లో ఇంటి దగ్గర విద్యార్థులు కొంతసేపు చదివినట్లయితే పాఠశాలలో 100శాతం పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళెంలో 144 సెక్షన్

బంగారుపాళెం: మండల కేంద్రంలో ఆదివారం నుంచి 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, ఈ నెల 13వ తేదీ బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 144 సెక్షన్‌ను అమలు చేశామన్నారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఎటువంటి దుకాణాలు, వాహనాలు పార్కు చేయరాదని సూచించారు. ప్రజలు గుంపులు, గుంపులుగా ఉండరాదన్నారు. ఆదివారం నుంచి సోమవారం సాయంత్రం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

ఇంటిదగ్గర చదవనివ్వాలి



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం దామోదరనాయుడు

పూతలపట్టు: పదో తరగతి విద్యార్థులను ఇంటి దగ్గర చదవనివ్వాలని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం దామోదరనాయుడు అన్నారు. పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు పిల్లలను దూరం పెట్టి, చదువుపైన దృష్టి సారించే బాధ్యత తల్లిదండ్రులపైన ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, మోహన్‌రెడ్డి, మాధవి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



యాదమరి: సమావేశంలో మాట్లాడుతున్న పాఠశాల హెచ్‌ఎం గిరిరాజ

యాదమరి: పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎంలు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పాఠశాలలో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నామని, పరీక్షలు దగ్గర పడుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటి వద్ద ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు గిరిరాజ, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భద్రతా వారోత్సవాలు



మోంటోకార్లో సిబ్బందికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

గుడిపాల: జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణాన్ని మోంటెకార్లో లిమిటెడ్ కంపెనీ నిర్వహిస్తోంది. ఈ కంపెనీ నందు 52వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించింది. చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ షంసుల్‌హక్ మాట్లాడుతూ ఈ వేడుక ముఖ్య ఉద్దేశం మనలక్ష్యం-హానిరహితం గురించి వివరించారు. అనంతరం క్విజ్ కాంపిటేషన్ విజేతలు, భద్రతా ప్రమాణాలు పాటించిన వారికి పతకాలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్‌చంద్ర చటాయి, హెచ్‌ఆర్ మేనేజర్ వేద్‌ప్రకాష్ థోమర్, క్వాలిటీ మేనేజర్ శ్రీనివాసులు, హైవే వర్క్‌మేనేజర్ పావగాడిమయూర్, ప్లాంట్ అండ్ మిషనరీ ఇన్‌చార్జ్ నిమ్మగడ్డ హనుమాన్ పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



అరగొండలో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న యోగలత

తవణంపల్లె: నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని కారుణ్య కమ్యూనిటీ డెవలప్‌మెంట్ మినిస్ట్రీస్ ట్రస్ట్ ఎండీ ఏ.జీ. యోగలత అన్నారు. మండలంలోని అరగొండ విక్రమ్ లాడ్జీ దగ్గర ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ట్రస్ట్ ఎండీ యోగలత మాట్లాడుతూ పూతలపట్టు నియోజకవర్గంలోని నిరుద్యోగ మహిళలకు ఆయా మండలాల్లో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తామని వెల్లడించారు. ప్రతి మండలంలో ఉచిత టైలరింగ్ శిక్షణ సెంటర్‌ను ఏర్పాటు చేసి, వంద మందికి ఆరు నెలలపాటు శిక్షణ ఇప్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని వివరించారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలో మొట్టమొదటగా అరగొండలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు, మిగత మండలాల్లో కూడా ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాలను ప్రారంభిస్తామని వివరించారు. అరగొండలో ఆదివారం అమెరికా వైద్య బృందంతో పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పన్నీర్ సెల్వం(సురేష్), వైఎస్సార్‌సీపీ నాయకులు వివేకానందరెడ్డి, అన్బు, సీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

మూతపడిన మద్యం దుకాణాలు

చిత్తూరు అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వైన్‌షాపులు, బార్లను శనివారం సాయంత్రం 4 గంటలకు మూసేసినట్లు మద్యం డిపో మేనేజర్ దయాసాగర్ తెలిపారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఈనెల 13వ తేదీ సాయంత్రం దుకాణాలు తెరవనున్నట్లు వెల్లడించారు.

వరి సాగులో మెలకువలు పాటించాలి

పాలసముద్రం : మండల పరిధిలోని రైతన్నలు వరి సాగులో మెలకువలు పాటించాలని వ్యవసాయ అధికారి డిల్లీప్రసాద్ తెలిపారు. శనివారం చెరుముందర కండ్రిగలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరి పొలంలో మిత్ర పురుగులు ఎక్కువగా ఉన్నందున పంటకు పురుగు మందులు వినియోగించవద్దని సూచించారు. వరి, వేరుశనగ పంటకు సేంద్రియ ఎరువులు విరివిగా వాడాలని, తద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా తీసుకున్న జింక్ సల్ఫేట్, బోరాన్, జిప్సం ఎరువులను సమతుల్యంగా వాడాలన్నారు. యజమాన్య పద్ధతులను క్షుణ్ణంగా వివరించారు. రైతులు సాగు చేసిన వరి పంటను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వనజ, రైతులు పాల్గొన్నారు.

వేడుకగా కుంభాభిషేక పూజలు



కుంభాభిషేక మహోత్సవాల్లో హోమ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

చిత్తూరు రూరల్: నగరంలోని బజారువీధిలో వెలసిన శ్రీ శివషణ్ముగ సుందర వినాయక స్వామి దేవస్థాన కుంభాభిషేక 6వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తమిళనాడు ప్రధాన అర్చకుల మంత్రోచ్చారణ నడుమ గణపతిహోమం, కలశపూజలు, పూర్ణాహుతి పూజలు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు చేసి దీపారాధనలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కణ్ణన్, గోపీనాథ్ కుమారుడు భూపేష్, ప్రముఖ కళాశాల కరస్పాండెంట్ నాగేశ్వరరావు దంపతులు, ఆలయ అర్చకులు శ్రీధర్, ఆలయ ఈవో తిమ్మారెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు విజయరాఘవులు, శ్రీధర్, పుష్పలత, రాజేంద్రబాబు, వరలక్ష్మీ, రాము, మణికంఠన్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని చిన్నకొమరగుంట గ్రామంలో ఉన్న పద్మావతి ఆండాల్ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు జగన్‌మోహన్ ఆధ్వర్యంలో వేకువజామునే సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ముందుగా స్వామివారిని వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఇందులో భాగంగా స్వామివారి ఉత్సవమూర్తులకు పూజలు చేపట్టారు.

వైభవంగా సంకట హర చతుర్థి

పలమనేరు: పట్టణంలోని బసవన్నగుడిలో శనివారం సంకటహర చతుర్థిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా బసవేశ్వరునికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం వినాయకస్వామికి అభిషేక పూజలు చేసి సంకట హర చతుర్థి వ్రతాన్ని నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పేర్నాటిని భారీ మెజారిటీతో గెలిపించండి



పూతలపట్టు: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



గుడిపాల: పోలింగ్ కేంద్రంలో కట్టుదిట్టంగా ఏర్పాటు చేసిన క్యూలు

పూతలపట్టు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కోరారు. ఆయన శనివారం మండలంలోని పి.కొత్తకోట పంచాయతీలో ప్రచారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టభద్రులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. వంద శాతం పోలింగ్ జరిగేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలదే అని తెలిపారు. మండలంలో పలు చోట్ల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రచారం చేశారు. నాయకులు రాజారత్నంరెడ్డి, సర్పంచ్ అమర్‌నాథరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రచారం

బంగారుపాళెం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని గుంతూరు, గొల్లపల్లె పంచాయతీలలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో కలసి ప్రచారం చేశారు. మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, పార్టీ నాయకులు లోకేష్, ప్రభు, మంజు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

తవణంపల్లె: ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి తమ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని పార్టీ మండల కన్వీనర్ సిద్ధంపల్లె హరిరెడ్డి, పార్టీ నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. ఆయన శనివారం మండలంలోని పుణ్యసముద్రం, పట్నం, సంతపల్లె, పైపల్లె, ద్వారకపురం తదితర గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి కరపత్రాలను అందజేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, పార్టీ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, మధుకుమార్, డేవిడ్, రుకేష్‌రెడ్డి, సాయిరెడ్డి, తేజరెడ్డి, దినేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ రెడ్డిని గెలిపించండి

యాదమరి: పట్టభద్రుల ఎమ్మెల్సీ శ్యాంప్రసాద్ రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షులు కార్తీక్ రెడ్డి, వరదరాజుల పల్లె సర్పంచ్ బాలకృష్ణా రెడ్డి ప్రచారం నిర్వహించారు. శనివారం వరదరాజుల పల్లె పంచాయతీలో ఉన్న పట్టభద్రుల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

గుడిపాల: ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. పట్టభద్రుల ఓట్లు 1008, ఉపాధ్యాయుల ఓట్లు 39 ఓట్లు ఉన్నాయని చెప్పారు. పోలింగ్ బూతుల వద్ద ఇప్పటికే తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్‌బూత్‌ల వద్ద మహిళల కోసం ప్రత్యేకంగా క్యూలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్‌బూత్ నుంచి 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలింగ్ బూత్ సమీపంలో ఉన్న దుకాణాలను కూడా మూసివేయనున్నట్లు చెప్పారు.







యాదమరి: ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షులు, బంగారుపాళెం: గుంతూరులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, తవణంపల్లె: పట్నంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు